# యువతకు ఉపాధి అవకాశాలే లక్ష్యం



- “మెగా జాబ్ మేళా” ప్రారంభోత్సవంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- పాల్గొన్న 30 కంపెనీల ప్రతినిధులు

**ప్రజానావ, సిరిసిల్ల :** నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాల కల్పనే ప్రజా ప్రభుత్వ లక్ష్యం అని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని కే కన్వెన్షన్ హాల్లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహించిన మెగా జాబ్ మేళాను రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సుమారు 30 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కరీంనగర్‌లో గతంలో నిర్వహించిన జాబ్ మేళాల్లో ఎంపికైన రాజన్న సిరిసిల్ల జిల్లా అభ్యర్థులకు విప్ ఆది శ్రీనివాస్ నియామక పత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలో ప్రజల సమస్యల పరిష్కారానికి 99 రోజుల ప్రణాళికను అమలు చేస్తున్నారని తెలిపారు. గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిల్లో సమావేశాలు నిర్వహిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకుంటున్నామని చెప్పారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం జాబ్ మేళాలను నిర్వహిస్తోందని, ఇప్పటివరకు రాష్ట్రంలో సుమారు 70 వేల ఉద్యోగాలు కల్పించామని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు ప్రైవేట్ రంగంలో కూడా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఈ మెగా జాబ్ మేళాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో గ్రూప్-1, ఉపాధ్యాయ నియామకాలు సహా పలు ఉద్యోగ నియామక ప్రక్రియలు చేపట్టామని మరిన్ని ఉద్యోగ నియామకాలు ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. యువత స్వయం ఉపాధి దిశగా అడుగులు వేయాలని వారి కోసం సబ్సిడీ రుణాలు మంజూరు చేస్తున్నామని, పరిశ్రమలు స్థాపించేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. మహిళా సంఘాలకు ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా రుణాలు అందిస్తున్నామని, యువతి యువకులు ఈ మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

# ఐక్య పోరాటాలతోనే బీడీ కార్మికులకు వేతన పెంపు



- బీడీ కార్మికుల పోరాటాలకు ఫలితం
- పెరిగిన వేతనాలను వెంటనే అమలు చేయాలి : సుతారి రాములు
- రెండు సంవత్సరాల కాలపరిమితితో కొత్త ఒప్పందం అమలు
- తెలంగాణ రాష్ట్రంలో 7 లక్షల మంది బీడీ కార్మికులకు లాభం

**ప్రజానావ, కోరుట్ల:** బీడీ కార్మికుల ఐక్య పోరాటాల ఫలితంగానే వేతనాల పెంపుదల సాధ్యమైందని తెలంగాణ రాష్ట్ర బీడీ వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుతారి రాములు తెలిపారు. శనివారం కోరుట్ల డివిజన్ కేంద్రంలోని సి. ప్రభాకర్ భవన్‌లో నిర్వహించిన బీడీ కార్మిక సంఘం (ఏఐటీయూసీ) జగిత్యాల జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.

## వేతనాలపై కొత్త ఒప్పందం.

ఈ నెల 7వ తేదీన హైదరాబాద్‌లో బీడీ పరిశ్రమ యజమానుల ప్రతినిధులు, బీడీ కార్మిక సంఘాల నేతల మధ్య జరిగిన సుదీర్ఘ చర్చల అనంతరం కొత్త వేతన ఒప్పందం కుదిరిందని తెలిపారు. వెయ్యి బీడీలు చుట్టినందుకు రూ. 275.31 చెల్లించడంతో పాటు బీడీ ప్యాకింగ్ వర్కర్లకు, నెలసరి ఉద్యోగులకు, ఇతర సిబ్బందికి రూ. 2200 వరకు వేతనాలు పెంచేందుకు అంగీకారం కుదిరిందన్నారు. ఈ ఒప్పందం ఈ నెల నుంచి అమల్లోకి వచ్చి రెండు సంవత్సరాల పాటు కొనసాగుతుందని వెల్లడించారు.

## 7 లక్షల బీడీ కార్మికులకు ప్రయోజనం.

పెరిగిన వేతనాలు తెలంగాణ రాష్ట్రంలోని సుమారు 7 లక్షల మంది బీడీ కార్మికులకు వర్తిస్తాయని సుతారి రాములు తెలిపారు. పీఎఫ్, నాన్ పీఎఫ్ కార్మికులకు సమానంగా వేతనాలు చెల్లించేందుకు కూడా ఒప్పందంలో స్పష్టత ఇచ్చినట్లు పేర్కొన్నారు. అలాగే నాణ్యమైన తునికాకు సరఫరా చేయడంతో పాటు కొత్తగా బీడీ కార్మికులకు పీఎఫ్ నంబర్లు జారీ చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు.

## అమలు చేయని యజమానులపై చర్యలు

కొత్త వేతన ఒప్పందాన్ని అమలు చేయని యజమానులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బీడీ కార్మికుల హక్కుల కోసం పోరాటాలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీడీ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు కొక్కుల శాంతక్క, ఉపాధ్యక్షులు అడ్వకేట్ చెన్న విశ్వనాథం, జిల్లా కోశాధికారి మహమ్మద్ ముక్రం, జిల్లా నేతలు మునుగోరి హనుమంతు, వెన్న మహేష్, అందె వంశీకృష్ణ, మహమ్మద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

# గౌడన్నల జీవనోపాధిపై అగ్నికీలలు



- ఇప్పపల్లిలో 5 ఎకరాల ఈతవనం దగ్ధం
- 2000 ‘ఈత-తాటి వనం’ దహనం.. 100 కుటుంబాలు ఉపాధి కోల్పోయిన దుస్థితి
- ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం అందించాలని గౌడ్ సంఘం విజ్ఞప్తి

**ప్రజానావ, కథలాపూర్:** కథలాపూర్ మండలం ఇప్పపల్లి గ్రామంలో గౌడన్నలకు చెందిన ఐదు ఎకరాల ఈతవనం భారీ అగ్నిప్రమాదానికి గురై పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటనలో సుమారు 2000 ఈత-తాటి చెట్లు అగ్నికి ఆహుతి కావడంతో దాదాపు 100 గౌడ్ కుటుంబాలు జీవనోపాధిని కోల్పోయాయి. కష్టపడి సొంతంగా కొనుగోలు చేసుకున్న భూమిలో సాగు చేస్తున్న ఈతవనం ఒక్కసారిగా మంటల్లో చిక్కుకోవడంతో గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది.

## రూ.15 లక్షల ఆస్తి నష్టం

ఈ అగ్నిప్రమాదంలో రిగ్గులు, ఈత చెట్లు, ఇతర సామగ్రి పూర్తిగా కాలిపోవడంతో దాదాపు రూ. 15 లక్షల వరకు నష్టం సంభవించినట్లు గౌడ్ సంఘ నాయకులు తెలిపారు. కుటుంబాల జీవనాధారమైన ఈతవనం బూడిద కావడంతో గీత కార్మికులు కన్నీరుమున్నీరవుతున్నారు. ‘మా కులవృత్తి మీదే దాడులు జరుగుతున్నాయి. మా కడుపు మీద కొట్టినట్టే’నంటూ గౌడన్నలు ఆవేదన వ్యక్తం చేశారు.

## ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి

ఈ సందర్భంగా గౌడ్ సంఘ సభ్యులు స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా కలెక్టర్‌ను వెంటనే స్పందించి బాధిత కుటుంబాలకు నష్టపరిహారం అందించాలని కోరారు. జీవనోపాధి కోల్పోయిన గౌడ్ కుటుంబాలను ఆదుకుని పునరావాస చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

# తప్పు చేస్తే ప్రభుత్వం ఎంతటి వారినైనా వదిలిపెట్టదు

**ప్రజానావ, నిర్మల్:** మైనర్ బాలికపై నమోదైన పోక్సో కేసులో బండి సాయి భగీరథను అరెస్టు చేయడం ద్వారా రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం చట్టం ముందు ఎవరికీ మినహాయింపు లేదని స్పష్టం చేసిందని ఆదివాసి కాంగ్రెస్ పార్టీ నిర్మల్ జిల్లా చైర్మన్ బాణావత్ గోవింద్ నాయక్ పేర్కొన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తప్పు చేసిన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోందని అన్నారు. ఈ కేసు విషయంలో సీఎం రేవంత్ రెడ్డి, పోలీసు యంత్రాంగంపై రిటైర్డ్ ఐపీఎస్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ చేసిన వ్యాఖ్యలు ప్రజల్లో చులకన భావన కలిగించేలా ఉన్నాయని విమర్శించారు. వెంటనే ఆయన ప్రజలకు, పోలీసు శాఖకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మైనర్ బాలికపై నమోదైన కేసులో బండి సాయి భగీరథను అరెస్టు చేసి చర్లపల్లి జైలుకు తరలించిన విషయాన్ని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు బీఆర్ఎస్ నాయకులకు లేదని బాణావత్ గోవింద్ నాయక్ వ్యాఖ్యానించారు. గతంలో ఫోన్ ట్యాపింగ్ అంశంపై తానే ఫిర్యాదు చేసిన విషయాన్ని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మర్చిపోయారా అని ప్రశ్నించారు. ప్రజా సమస్యల కంటే రాజకీయ ప్రయోజనాల కోసం మాట్లాడితే ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.



# దేశంలో పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలు వెంటనే తగ్గించాలి




**ప్రజానావ, గన్నేరువరం:** ప్రజలపై పన్నుల భారం మోపి మోడీ ప్రభుత్వాన్ని ఓడిద్దాం ప్రజాహితం కోసం అని చేస్తే బెహన్ జి గారిని ప్రధాని చేద్దాం అని అడ్వకేట్ నిషాని రామచంద్రన్ ఒక పత్రిక ప్రకటనలో కోరారు.

# మోకిల సీఐని సన్మానించిన ఏఎంసీ మాజీ చైర్మన్ రాజు నాయక్



**ప్రజానావ, శంకర్‌పల్లి:** శంకర్‌పల్లి మండలం మోకిల పోలీస్ స్టేషన్ సీఐ శ్రీనివాస్ రెడ్డిని శనివారం శంకర్ పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సభావత్ రాజు నాయక్ మర్యాదపూర్వకంగా కలిసి సిఐని శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతిని కాపాడడానికి ప్రతి ఒక్క ప్రజా నాయకులు సహకరించాలని కోరారు.

# ఉపాధి హామీ కూలీకి గాయాలు

## చర్లపల్లిలో ఘటన.. విరిగిన కుడిచెయ్యి ఎముక



**ప్రజానావ, ఎండపల్లి:** మండలం పరిధి చర్లపల్లి గ్రామంలో ఉపాధి హామీ పనుల్లో పాల్గొంటున్న మహిళా కూలీ పడిదం శంకరమ్మ ప్రమాదవశాత్తు తీవ్రంగా గురువారం గాయపడింది. పనులు నిర్వహిస్తున్న సమయంలో ప్రమాదం చోటుచేసుకోగా, అక్కడే ఉన్న సహచర కూలీలు వెంటనే స్పందించి జగిత్యాలలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. వైద్య పరీక్షల అనంతరం ఆమె కుడిచెయ్యి ఎముక విరిగినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రోజువారీ కూలీ పనులతో కుటుంబాన్ని పోషించుకునే శంకరమ్మకు వైద్యులు నెల రోజుల పాటు విశ్రాంతి అవసరమని సూచించినట్లు తెలిసింది. దీంతో పని చేయలేని పరిస్థితి ఏర్పడటంతో పాటు వైద్య ఖర్చులు భారంగా మారాయని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. ఉపాధి లేక ఇంటి వద్దనే ఉండాల్సిన పరిస్థితి రావడంతో కుటుంబ ఆర్థిక పరిస్థితిపై తీవ్ర ప్రభావం పడిందని తెలిపింది. ప్రమాద విషయం తెలుసుకున్న ఏపీవో అనిల్ బాధితురాలి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ప్రమాదానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకుని, ఉపాధి హామీ పథకం ద్వారా లభించే వైద్య ఖర్చులు మరియు ఆర్థిక సహాయం ప్రభుత్వం నుంచి అందించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మండల పరిషత్ మాజీ కో-ఆప్షన్ సభ్యులు మహ్మద్ రియాజ్, పంచాయతీ కార్యదర్శి తిరుపతి రెడ్డి, నాయకులు పడిదం నారాయణ, సిగిరి ఆనంద్, అనిల్, ఫీల్డ్ అసిస్టెంట్ జంజుపెల్లి సురేష్ పాల్గొన్నారు.

# ఎండపల్లిలో నేడు రాజకీయ సందడి

## మంత్రి అడ్లూరి, మాజీ మంత్రి కొప్పుల పర్యటన

**ప్రజానావ, ఎండపల్లి:** మండలంలో ఆదివారం వేసవి వేడితో పాటు రాజకీయ వేడి వాతావరణం నెలకొననుంది. రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ వేర్వేరు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు మండలంలో పర్యటించనున్నట్లు ఆయా పార్టీల నాయకులు తెలిపారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అంబారిపేట గ్రామంలో మహిళా సంఘం భవన నిర్మాణానికి నిర్వహించే భూమిపూజ కార్యక్రమానికి హాజరుకానున్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొనే అవకాశముంది. ఇక మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ముంజంపల్లి గ్రామంలో నిర్వహించనున్న బీఆర్ఎస్ పార్టీ నిరసన కార్యక్రమంలో పాల్గొననున్నారు. వరి ధాన్యం కొనుగోళ్లలో జాప్యం, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు రైతులతో ఈ నిరసన చేపడుతున్నట్లు ప్రతిపక్ష పార్టీ నాయకులు పేర్కొన్నారు. ఒకే రోజు మంత్రి, మాజీ మంత్రి మండలంలో పర్యటించనున్న నేపథ్యంలో రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

# తల్లిని సజీవ దహనం చేసిన కుమారుడు

**ప్రజానావ, ముంబై:** ధూలే తాలూకాలో దారుణ ఘటన చోటుచేసుకుంది. “నాకు ఎందుకు పెళ్లి చేయడం లేదు?” అంటూ 45 ఏళ్ల ప్రదీప్ అలియాస్ దగడు ఖైర్నార్ తన 65 ఏళ్ల తల్లి జిజాబాయి భాటు ఖైర్నార్-పాటిల్‌పై మండే ద్రవం పోసి నిప్పంటించాడు. తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. పోలీసుల వివరాల ప్రకారం, ప్రదీప్‌కు పెళ్లి విషయంలో ఇబ్బందులు రావడంతో తల్లితో తరచూ గొడవలు జరిగేవి. శుక్రవారం తెల్లవారుజామున మద్యం సేవించి ఇంటికి వచ్చిన అతడు ఈ దారుణానికి పాల్పడ్డాడు. ఘటనపై కేసు నమోదు చేసిన ధూలే తాలూకా పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

